

# మొపాసా కథలు

అనువాదం: అరిపిరాల సత్యప్రసాద్



**గి ది మొపాస (ఆగష్టు 5, 1850 — జులై 6, 1893)**

ఈ శీర్షికలో 19 వ కథ

# ఏమో? ఎవరికెరుక??

(మొపాసకు మతిభ్రమించి పిచ్చాసుపత్రిలో 1893లో మరణించడానికి ముందు రాసిన ఆఖరు కథగా చెప్పబడుతున్న ఈ కథ ఆయన వర్ధంతి సందర్భంగా...)

మై గాడ్! మై గాడ్!

రాసేయ్యబోతున్నాను. నాకేమైందో రాసేయ్యబోతున్నాను. కానీ ఎలా? ఇలా రాయలంటే అంతె ధైర్యం కావాలో నాకు తెలుసు. ఇది ఎంత విచిత్రమైనదో అంత ప్రత్యేకమైనది. అంతే కాదు, అనూహ్యమనదీ, అర్థం లేనిది కూడా!

నేనేం చూశానో ఖచ్చితంగా చెప్పలేకపోవచ్చు. కానీ నా తర్కంలో ఏ తప్పు లేదు. నా మాటల్లో ఏ పొరపాటు లేదు. నేను గమనించిన దాంట్లో ఏదీ ముందు వెనుక కాలేదు. కేవలం హాలూజినేషన్ వల్ల మోసపోయానంటారేమో? అర్థం లేనిదేదో చూశానని అందరూ ఎద్దేవా చేస్తారేమో. ఏమో ఎవరికెరుక?

నిన్న నేను ఒక పిచ్చాసుపత్రికి వెళ్ళాను. నా అంతట నేనే వెళ్ళాను. నాకున్న కాస్త విజ్ఞత వల్ల అనుకోండి, భయం వల్ల అనుకోండి. నా గతం మొత్తం తెలిసిన ఒకే ఒక వ్యక్తి ఆ ఆసుపత్రిలో డాక్టరు. అతనికోసమే రాస్తున్నాను. ఎందుకు అని మీరు అడిగితే నేనేం చెప్పలేను. నాక్కూడా తెలియదు. బహుశా నాకున్న ఆ ఇబ్బందిని తొలగించుకోడానికేమో. అవును, ఒక భరించలేని పీడకల నాకు తెలియకుండానే నన్ను ఇబ్బంది పెడుతోంది.

ఆగండాగండి..! కాస్త వివరంగా చెప్తాను.

నా గురించి చెప్పుకోవాలంటే – ఏకాంతంగా వుంటాను, కలలు కంటుంటాను. ఒక రకమైన ఒంటరి తత్వవేత్తలా బతుకుతుంటాను. ఏం జరిగినా అంతగా పట్టించుకోను. ఉన్నదాంట్లో తృప్తిగా బతకగలను. ఈ లోకంలోనే కాదు, పై లోకంలో కూడా నాకు ఎవరితోనూ విరోధమనేది లేదు. చిన్నప్పటి నుంచీ ఒంటరిగా బతకడమే అలవాటైంది. అందువల్ల పదిమందితో కలవాలంటే ఒక రకమైన

ఇబ్బంది నన్ను అవరిస్తుంది. మీకు ఎలా వివరించాలో నాకు తెలియడం లేదు. నాక్కూడా తెలియదు. బయట ప్రపంచంలో తిరగకూడదని ఏం లేదు. తిరుగుతాను. స్నేహితులతో కలుస్తాను, మాట్లాడతాను, వాళ్ళతో కలిసి డిన్నర్లకి కూడా వెళతాను. కానీ వాళ్ళు నాకు దగ్గరగా ఎక్కువసేపు వున్నారంటే చాలు, వాళ్ళు ఎంత దగ్గరవాళ్ళైనా సరే నాకు బోరు కొట్టేస్తుంది. నీరసం వచ్చేస్తుంది. వాళ్ళు అప్పటికప్పుడు లేచి వెళ్ళిపోతే చూడాలన్న కోరిక నా మనసులో మొదలై అది ఒక బాధలా రూపాంతరం చెందుతుంది. నన్ను ఒంటరిగా వదిలేసి వాళ్ళు వెళ్ళిపోవాలని కోరుకుంటాను.

అది కోరిక కాదు. ఒక అవసరంగా మారిపోతుంది. అది జరగకపోతే తట్టుకోలేని స్థితికి వెళ్ళిపోతుంది. నాతో పాటు వున్న మనుషులు కదలకుండా అలాగే వున్నారనుకోండి, వాళ్ళ మాటలను నేను వినక తప్పలేదనుకోండి, వినడమే కాకుండా చాలాసేపటి వరకు వాళ్ళ సంభాషణ అర్థం చేసుకోవాల్సి వచ్చిందనుకోండి.. ఇంకేముంది? అది ఓ ప్రమాదంగా పరిణమిస్తుంది. ఎలాంటి ప్రమాదం అంటే? ఏమో ఎవరికెరుక? బహుశా తీవ్రత తక్కువగా వున్న పక్షవాతం రావచ్చు? ఏమో జరిగినా జరగవచ్చు!

నాకు ఒంటరితనం ఎంత ఇష్టం అంటే ఒకే పైకప్పు కింద నాతో పాటు మరో మనిషి ఉంటే, అతను పడుకోని నిద్రపోతున్నా సరే, కనీసం ఆ భావనని కూడా నేను తట్టుకోలేను. ప్యారిస్ మహానగరంలో బతకడం నా వల్ల కాదు. అలాంటి చోట నా బాధ మరింత తీవ్రతరం అవుతుంది. నేనేదో నా పాటికి ధర్మంగా బతికేస్తుంటాను. అందువల్ల లెక్కకు అందకుండా తండోపతండాలుగా తిరిగే జనం మధ్య వుండలేను. నా శరీరంలోపల, నరనరాల్లోపల ఒక యాతన కలుగుతుంది. వాళ్ళేమో నిద్రపోయేటప్పుడు కూడా గుంపులు గుంపులుగానే వుంటారు. అబ్బా! అవతలివాళ్ళు నిద్రపోయే దృశ్యం వాళ్ళతో సంభాషణ కన్నా దారుణమైనది. నా గది గోడకి అవతల వైపు ఎన్నో జీవాలు నిత్యం ఇలా గ్రహణం పట్టిన గ్రహాల్లా బతుకుతున్నారన్న భావన కలిగినా కూడా ఇక నేను ఆ గోడ పక్కన పడుకొని విశ్రమించలేను.

నేను ఎందుకులా వున్నాను? ఏమో ఎవరికెరుక? బహుశా చాలా చిన్న కారణం అయ్యుంటుంది. నాలోంచి ఉద్భవించినవి తప్ప వేరే ఏమైనా నాలో అసహనాన్ని కలిగిస్తాయి. అలా అసహనం కలిగించే మనుషులు ప్రపంచంలో చాలా మంది వున్నారు.

అంతా భూమి మీదే వున్నాం. కానీ రెండు వర్గాలుగా బతుకుతాము. మొదటి రకానికి ఇతరులతో అవసరం వుంటుంది. ఆ ఇతరులు వీళ్ళని ఆనందింపజేస్తారు, ఆలోచింపజేస్తారు, ఓదారుస్తారు. ఇలాంటి వాళ్ళకి ఒంటరితనం బాధని కలిగిస్తుంది. వేధిస్తుంది. ఒక దారుణమైన మంచుపలకలాగ, దాటలేని ఎడారిలా అనిపిస్తుంది. ఇక రెండో వర్గం మొదటి రకానికి పూర్తి వ్యతిరేకంగా వుంటారు. ఇతరులతో కలవడం వీళ్ళకి విసుగుని కలిగించి అలసిపోయేలా చేస్తుంది. సన్నగా బాధిస్తుంది. వీళ్ళకి ఒంటరితనం సాంత్వననిస్తుంది. స్వతంత్రంగా విశ్రమించే అవకాశాలు వెతుక్కొని అందులో జలకాలాడుతారు. తమ ఆలోచనలోనే హాస్యాన్ని వెతుక్కొని అందులో మునిగితేలుతూ నవ్వుకుంటుంటారు. ఇది చాలా సాధారణమైన, సామాన్యమైన శారీరక లక్షణం మాత్రమే. కొంతమంది తమ లోనించి తాము బయటపడి అక్కడే బతకడానికి సృష్టించబడితే, కొంతమంది తమలోపలే బతకడానికి కల్పించబడ్డారు. నా విషయానికి వస్తే, బయటప్రపంచంతో నా సంబంధాలు ఆకస్మికంగా ఆగిపోతూ, బాధకరమైన ముగింపుని త్వరగా తీసుకొస్తుంటాయి. అవి ముగిసిపోవాల్సిన హద్దుని దాటి కొనసాగాయంటే నా శరీరం మొత్తంలోనూ, నా ఆలోచనలోనూ తట్టుకోలేని ఇబ్బంది కలుగుతుంది.

ఆ కారణంగానే నేను అచేతనమైన వస్తువులతో అనుబంధం ఏర్పరుచుకున్నాను. ఏర్పరుచుకోక తప్పలేదు అని కూడా చెప్పచ్చు. అవి నాకు మనుషులంత ముఖ్యమైనవి అయ్యాయి. అందుకే నా ఇల్లే నా ప్రపంచంగా బతుకుతుంటాను. అందులోనైతే నేను ఒంటరిగా, చలాకీగా బతికేయగలను. నా చుట్టూ రకరకాల వస్తువులు, ఫర్నీచర్, బాగా పరిచయం వున్నట్లు వుండే చిన్న చితకా వస్తువులు వుంటాయి. వాటిని చూస్తే నా కళ్ళలో ఒక మనిషి ముఖాన్ని చూస్తే కలిగే భావనే కలుగుతుంది. అందుకే అలాంటివి ఇంటి నిండా ఒక్కొక్కటిగా చేర్చి పెట్టుకున్నాను. చక్కగా అలంకరించుకున్నాను. వాటిని చూస్తే నా అంతరాంతరాలలో ఒక తృప్తి, సంతుష్టి కలుగుతుంది. వాటిని

తాకినప్పుడల్లా అలవాటైన ఆ స్పర్శలో లాలన నాకు సాంత్వనని ఇవ్వటమే కాదు, క్రమంగా ఒక అవసరంగా కూడా మార్చేసాయి. బహుశా గాఢంగా ప్రేమించిన అమ్మాయి కౌగిలి కూడా నాకు అంత సంతోషాన్ని ఇవ్వదేమో.

ఓ అందమైన తోట మధ్యలో ఈ ఇల్లు కట్టించుకున్నాను. తోటలోని చెట్లు రహదారుల్లో తిరిగే మనుషుల కంట్లో పడకుండా ఈ ఇంటిని దాచిపెడతాయి. నగరానికి ముఖద్వారానికి దగ్గరగా వుండటం వల్ల అప్పుడప్పుడు వుండే సామాజిక అవసరాలను కూడా తీర్చుకునే అవకాశం వుంటుంది. నా పనివాళ్ళందరూ నా ఇంటికి కాస్త దూరంగా కట్టించిన వేరే ఇంటిలో వుంటారు. ఆ ఇల్లు నా పెరడు చివర్లో వుంటుంది. ఆ ఇంటివెనకే మొదలై చుట్టూ వుండే ఎత్తైన గోడలు. చీకట్లు నిగూఢంగా వుంచే లోకం, మౌనం కమ్మేసే ఏకాంత గృహం, మహా వృక్షాలు పెద్ద పెద్ద ఆకులతో కప్పేసిన ప్రదేశం. ఇంకేం కావాలి. ఈ ప్రాంతం నాకు ఎంత నెమ్మదిని ఇస్తుందో చెప్పలేను. రోజూ నిద్రకు ఉపక్రమించడానికి ముందు సాయంత్రాలు కొన్ని గంటలు అక్కడక్కడే పచార్లు చేస్తాను. ఏకాంతాన్ని ఇంకొంచెం జుర్రుకునే ప్రయత్నం చేస్తాను.

ఒక రోజు సిటీ థియేటర్లో “సింగ్నాడ్” ప్రదర్శన జరిగింది. అంత అందమైన, అద్భుతమైన సంగీతాన్ని వినడం అదే మొదటిసారి నాకు. కలలో జరిగినట్లుండే కథ. ఆ నాటకం ద్వారా ఉల్లాసాన్ని, ఎంతో సంతోషాన్ని పొందాను. తిరిగి వచ్చేటప్పుడు అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తుంటే నా తలలో సన్నటి శబ్దంలా ఆ నాటకంలోని వాక్యాలే వినపడుతున్నాయి. అద్భుతమైన సన్నివేశాలు నా మెదడులో నుంచి నన్ను వెంటాడుతున్నాయి. చుట్టూ మృత్యువులాంటి చీకటి. ఎంత చీకటి అంటే ఏది దారో ఏది కాదో తెలియడం లేదు. ఫలితంగా రెండు మూడు సార్లు తుప్పల్లోకి వెళ్ళిపోయాను. ఊరి మొదట్లో వుండే కస్టమ్స్ హౌస్ దాటిన తరువాత ఒక మైలు దూరంలో నా ఇల్లు. అటూ ఇటుగా ఓ ఇరవై నిముషాల నడక.

అర్థరాత్రి ఒంటి గంటో, ఒకటిన్నర గంటో అయ్యుంటుంది. ఆకాశంలో మబ్బులు తొలగిపోయి నెలవంక తొంగి చూసింది. విషాదాన్ని మోస్తున్న మూడో ఝాము నెలవెంక. మొదటి ఝాము వచ్చే నెలవంక వేరు. సాయంత్రం అయిదు ఆరుగంటలప్పుడు స్పష్టంగా, ఆనందాన్ని మోస్తూ వెండి రంగుతో మెరిసిపోతుంటుంది. అర్థరాత్రి దాటిన తరువాత కనిపించే చంద్రుడు ఎర్రగా, బాధల్ని మోస్తూ ఒంటరిగా వుంటాడు. రాత్రుళ్ళు తిరిగిన ప్రతి వేటగాడికి ఇది అనుభవమే. సాయంత్రపు చంద్రుడు సన్నటి దారంలా వుండి కనిపించీ కనిపించని ఆహ్లాదకరమైన వెలుగుల్ని పరుస్తూ గుండెల్లో ఆనందాన్ని నింపుతాడు. ఆ చంద్రుడు భూమి మీద పల్చటి నీడల్ని వరుసగా పేరుస్తాడు. ఆఖరి అంకంలో వున్న చంద్రుడు ఆరిపోయే దీపంలా మిణుకు మిణుకుమంటూ వుంటాడు. అతని వెలుగులు ఏ నీడలనీ కల్పించలేవు.

దూరంగా నా తోట విషాదవార్తల్ని చేరవేస్తున్నట్లు అనిపించింది. ఎందుకో తెలియదు కానీ ఆ తోటలోకి వెళ్ళనివ్వకుండా వుంచే ఒక వ్యాకులత లాంటి భావం నన్ను కమ్మేసింది. నా నడక మందగించింది. గుంపులు గుంపులుగా వున్న చెట్లు పాతిపెట్టిన నా ఇంటి పైన కట్టిన సమాధుల్లా కనపడ్డాయి.

నేను నా ఇంటి వైపుకి వెళ్ళే ముఖద్వారం తెరిచాను. ఆ దారిలో గుహలా కప్పేసిన రావిచెట్ల, బయటి ప్రపంచానికి నా ఇల్లు తెలియకుండా అడ్డుగోడలాగా నిలబడి వున్నాయి. ఆ చెట్లు ఒకదాని తరువాత ఒకటి దారి ఎటు తిరిగితే అటు వంకలు తిరుగుతూ గరిక పెరిగిన లాన్లను కప్పేస్తున్నాయి. ఆ లాన్లలో వున్న మొక్కలకు పూసిన పూలు ఆ అంధకారంలో అస్పష్టంగా గోచరమౌతున్నాయి.

ఇంటికి దగ్గరపడే కొద్దీ, అనూహ్యమైన భావాలేవో కమ్ముకున్నాయి. ఏమీ వినపడటం లేదు. నిశ్చలంగా నిలబడ్డాను. దట్టమైన చెట్ల మధ్యలోనుంచి కనీసం గాలి కదులుతున్న చప్పుడు కూడా లేదు. “ఏమైంది నాకు?” అనుకున్నాను.

పదేళ్ళనుంచి ఇదే దారిలో ఇంటికి వస్తూనే వున్నాను. ఇంతటి స్థబ్దత ఎప్పుడూ అనుభవంలోకి రాలేదు. రాత్రి చీకట్లు నన్ను ఎన్నడూ భయపెట్టింది లేదు. ఆ సమయంలో ఏ దొంగో, బందిపోటో కనపడితే అమాంతంగా వాడి మీదికి కోపంతో ఉరికేవాడిని. ఏ మాత్రం

జంకేవాడిని కాదు. పైగా నా దగ్గర నా రివాల్వర్ కూడా వుంది. కాని నేను దాన్ని తాకలేదు. నా మనసులో రగులుకున్న భయం నా చేతులు కట్టేసింది.

ఏమిటిది? ఇదేమైనా శకునమా? ఏదో నిగూఢమైన శకునం కావచ్చు. ఊహకందని ఏదో అనుభవాన్ని చవిచూడబోయే ముందు కలిగిన అపశకునం కాదు కదా? ఏమో? ఎవరికెరుక?

ముందుకు వెళ్తుంటే కొద్దికొద్దిగా పెరుగుతూ నా చర్మం కింద వణుకు పెరగటం మొదలైంది. నా ఇంటి గోడ దగ్గరకు చేరిన తరువాత, తలుపులు తెరిచి లోపలికి వెళ్ళకుండా అక్కడే కాస్సేపు ఆగి కొద్ది నిముషాలు గడిపితే మంచిదని అనిపించింది. నా డ్రాయింగ్ రూమ్ కిటికీ కింద వున్న బెంచి మీద కూర్చున్నాను. మనసులో కలవరం అలా వుండగానే అక్కడే కాస్సేపు సేదతీరాను. నా తల గోడకి ఆనించి, కళ్ళు తెరిచి చూస్తున్నాను. చెట్ల ఆకులు నా ముఖం మీద చిత్రమైన నీడలు వేస్తున్నాయి. కొన్ని నిముషాలపాటు నాకేమీ అసహజంగా కనిపించలేదు. నా చెవులలో ఝుమ్మంటూ ఏదో శబ్దం వినపడింది. కానీ, నాకు అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది. ఒకోసారి నాకు రైళ్ళు పరుగెడుతున్న చప్పుడు వినపడుతుంది. మరోసారి గోడగడియారం గంటలు కొడుతున్నట్లు, ఇంకోసారి సైనికుల కాల్బలం కవాతు చేస్తున్నట్లు అనిపిస్తుంటుంది.

కాస్సేపటిలో ఝుమ్మంటున ఆ శబ్దాలు మరింత స్పష్టంగా, మరింట ప్రత్యేకంగా మారుతున్నట్లు నిర్ధారించుకున్నాను. బహుశా నన్ను నేనే నమ్మించుకున్నాను. నా శరీరంలో నరాలు జలదరించడం వల్ల కలిగిన శబ్దాలను నా చెవులకు అలాంటి శబ్దాలుగా వినిపిస్తున్నాయని అనుకోడానికి లేదు. అవి ఇంకా స్పష్టంగా వున్నాయి. కాస్త తికమకగా అనిపిస్తున్నా అవి మాత్రం ఇంటిలో లోపలి నుంచే వస్తున్నాయి. అందులో ఏ అనుమానమూ లేదు. ఆ శబ్దాలు అలా గదిలో నుంచి గోడలను దాటి వస్తూనే వున్నాయి. శబ్దాలు అనడానికి లేదు. ఏదో భారమైన వస్తువులు జరుపుతున్నట్లు, ఎవరో మనుషులు నా ఫర్నీచర్ మీదకు దూకుతున్నట్లు, వాటి కదిలిస్తున్నట్లు, ఈడ్చి ఎత్తుకెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నట్లు అనిపించింది.

నా చెవులలో వినపడుతున్నది నిజమేనా అన్న అనుమానంతో కాస్సేపు గడిపాను. నా ఇంటికి బయటవైపు వున్న గదులలో ఒక గది గోడపైన నా చెవిని ఆనించి వింటే అర్థంకాని వింత శబ్దాలు అక్కడ్నుంచే వస్తున్నాయని నిర్ధారణ అయ్యింది. నాకేం భయం కలగలేదు. ఎలా చెప్పాలి మీకు? ఆశ్చర్యం వల్ల అచేతనంగా వుండిపోయాను అంతే! దగ్గరే వున్నా రివాల్వర్ బయటకు తీయలేదు. దాని వల్ల ఏమంత ప్రయోజనం వుంటుందని నాకు అనిపించలేదు.

చాలాసేపు విన్నాను కానీ ఏ నిర్ణయానికీ రాలేకపోయాను. నా ఆలోచనలు స్పష్టంగానే వున్నాయి. కాకపోతే లోలోపల ఎక్కడో ఉత్సుకత వుంది. లేచి నిలబడి ఇంకొద్దిసేపు ఎదురు చూశాను. వస్తున్న శబ్దాలను మాత్రం వింటూనే వున్నాను. అవి కొద్దికొద్దిగా పెరుగుతున్నాయి. ఉండుండీ గట్టి శబ్దాలు వినపడుతున్నాయి. ఆ చప్పుడులోనే ఏదో కోపం, కసి కలగలిపినట్లు విచిత్రంగా అనిపిస్తోంది.

ఉన్నట్టుండి నా పిరికితనం మీద నాకే అసహ్యం వేసింది. నా తాళాల గుత్తి చేతిలో తీసుకున్నాను. నాకు కావాల్సిన తాళం చెవి తీసి తలుపుకు వున్న తాళంలో పెట్టి రెండుసార్లు తిప్పాను. ఒక్కసారి తలుపుల్ని బలమంతా ఉపయోగించి తోయడంతో అది ధబ్బున తెరుచుకోని వెనక్కి వెళ్ళి గోడలకు కొట్టుకుంది. ఆ చప్పుడు ఓ తుపాకి పేలినట్లు వినపడింది. దాంతో పైకప్పు నుంచి, పునాదుల్దాకా అల్లకల్లోలమైనట్లైంది. రెప్పపాటులో జరిగిన ఆ సంఘటన ఎంత పెద్ద చప్పుడు చేసిందో అంతే భయపెట్టింది కూడా. నేను రెండు అడుగులు వెనక్కి తగ్గి, పెద్దగా ఫలితం వుండదని తెలిసినా జాగ్రత్తకోసం రివాల్వర్ తీసి చేతిలో వుంచుకున్నాను.

అలాగే వుండి చాలాసేపు విన్నాను. ఇప్పుడు స్పష్టత వస్తోంది. ఇంట్లో వున్న పెద్ద పెద్ద మెట్లమీద, నున్నటి నేల మీద, కార్పెట్ మీద బలంగా నడుస్తున్న అడుగుల చప్పుడు తెలుస్తోంది. ఆ చప్పుడు బూట్లేసుకున్న పాదాలవి కావు. ఉత్త కాళ్ళతో నడిచినప్పుడొచ్చే శబ్దమూ

కాదు. బహుశా ఇనుముతో చేసినవో, లేక చక్కతో చేసిన కర్రలవి. కాళ్ళు లేనివాళ్ళు చేతికింద పెట్టుకోని నడిచే కర్రలు వుంటేయే లాంటి కర్రలు నేలమీద మోదుతున్న చప్పుడు. ఆ శబ్దం బ్యాండు మేళంలో వాడే పెద్ద పెద్ద చేతి తాళాలను కొట్టినట్లు వుంది. నేను నా తలుపు మొదట్లో వుండగానే ఏం జరుగుతోందో అర్థం అయ్యింది. నా చేతి కుర్చీ – నేను చదువుకునేటప్పుడు కూర్చునే పెద్ద కుర్చీ కదిలింది. దొర్లుకుంటూ బయట వున్న తోటలోకి వెళ్ళిపోయింది. దాని వెంటే డ్రాయింగ్ రూమ్ లో వున్న మిగిలిన వస్తువులు కూడా కదిలాయి. సోఫాలు వాటిని అవే ఈడ్చుకుంటున్నట్లు, మొసళ్ళు ముందుకాళ్ళ మీద దేకినట్లు కదిలాయి. ఆ తరువాత నా కుర్చీలు గొర్రెల్లా బయటపడ్డాయి. చిన్న చిన్న టీపాయిలు కుందేళ్ళలా గెంతుకుంటూ వచ్చాయి.

ఓహ్! ఎలాంటి అనుభూతి! ఒక్క ఉదుటన దట్టమైన పొదల చాటుకు దూకి అక్కడే గుట్టుగా చూస్తూ కూర్చున్నాను. చూస్తుండగానే తమ గత స్థితిని మరచిపోయినట్లు ఫర్నీచర్ మొత్తం ఒకదాని వెంట ఒకటి నడక సాగించాయి. వాటి వాటి బరువుని బట్టి కొన్ని చకచకా నడుస్తుంటే కొన్ని నింపాదిగా నడుస్తున్నాయి. నా పియానో, గ్రాండ్ పియానో గుర్రంలా దూకుతూ వచ్చింది. అలా వస్తుంటే దానిలో నుంచి మందంగా గొణిగినట్లు సంగీతం వినిపిస్తోంది. చిన్న చిన్న వస్తువులు నత్తల్లా గులకరాళ్ళ మీద జారుతున్నాయి. నా బ్రష్షులు, కప్పులు, సాసర్లు, రంగురాళ్ళు ఇలాంటివన్నీ చంద్రకిరణాలు పడి మెరుస్తున్నాయి. ఆ తరువాత నా రైటింగ్ డెస్క్ వచ్చింది. అది ఓ శతబ్దకాలం నాటి నిగూఢ సత్యాల ఆలవాలం. దాని నిండా నా జీవితకాలం మొత్తం అందుకున్న వుత్తరాలు వున్నాయి. నా హృదయం చరిత్ర మొత్తం వాటిలోనే వుంది. తడిమినప్పుడల్లా నేను క్షోభపడ్డ గతం మొత్తం అక్కడే వుంది. అవి కాక అపురూపంగా దాచుకున్న ఎన్నో ఫోటోలు అందులోనే వున్నాయి.

ఒక్కసారిగా నాలో భయం మాయమైపోయింది. దాని మీదకు దూకి ఒక దొంగని పట్టుకున్నట్లు, పారిపోబోతున్న భార్యని పట్టుకున్నట్లు పట్టేసుకున్నాను. అది మాత్రం దాని దారిలో పోవటం ఆపలేదు. ఎంత ప్రయత్నం చేసినా, ఎంత బిగించి పట్టుకున్నా దాని వేగాన్ని తగ్గించలేకపోయాను. దాన్ని ఆపడానికి విశ్వప్రయత్నం చేశాను కానీ, దాని బలం ముందు తట్టుకోలేక కిందపడ్డాను. అది నన్ను తొక్కేస్తూ ముందుకు వెళుతూ నన్ను కూడా గులకరాళ్ళ మీద ఈడ్చుకెళ్ళసాగింది. దాని వెనకే వస్తున్న మిగిలిన ఫర్నీచర్ కూడా నా మీద ఎక్కుతూ, నా కాళ్ళని నలగకొట్టాయి. డెస్క్ మీద నుంచి నా పట్టు తప్పగానే మిగిలినవన్నీ నా మీద నుంచీ ఒక చచ్చిన సైనికుడిమీద నుంచి వెళ్ళే సైనిక దళంలా సాగిపోయాయి.

భయం మళ్ళీ చుట్టుముట్టింది. ఆ దారిలోనించి తప్పుకోని మళ్ళీ పొదల చాటుకు వెళ్ళగలిగాను. అక్కడ్నుంచి చూశాను. ఒక్కొక్కటిగా వస్తువులన్నీ వెళ్ళిపోవటం, ప్రతి చిన్న వస్తువు, నాకు ఎంతో పరిచయం వున్న వస్తువులు.. అవి నా వస్తువులు.. నావనుకున్న వస్తువులు.

అప్పుడే దూరంగా నా ఇంటిలోనుంచి వస్తున్న శబ్దాలు వినపడ్డాయి. ఇల్లంతా ఖాళీగా వుందేమో ఆ చప్పుడు మరీ పెద్దదిగా వినపడింది. తలుపులు మూతపడుతున్న చప్పుడు. అవును, ఎవరో తలుపుల్ని దభీమని వేస్తున్నట్లు పైన గదుల్నించి కిందదాకా ప్రతి తలుపు మూతపడుతున్నాయి. నేను ఇంతకు ముందు తెరిచిన తలుపుతో సహా అన్నీ తలుపులు ఆయా గదుల్లో వున్న వస్తువులు బయటికి వెళ్ళిపోగానే మూసుకుపోతున్నాయి. ఆఖరి తలుపు పడిపోయిన మరుక్షణం నేను అక్కడ్నుంచి పరుగందుకున్నాను... సరే, పారిపోయాను. సిటీ వైపుకి వెళ్ళి అక్కడి తోటల దగ్గర చీకట్లో మనుషులు కనపడేదాకా నేను మనిషిని కాలేకపోయాను.

నాకు తెలిసిన హోటల్ ఒకటి వుంటే అక్కడికి వెళ్ళి బెల్ కొట్టాను. నా వంటి మీద వున్న దుమ్ము ధూళి విదిలించుకొని నిలబడ్డాను. బయటికి వచ్చిన పోర్టర్ తో నా తాళాల గుత్తి పోయిందనీ, వాటిలోనే పెరటి తలుపు తాళాలు కూడా వున్నాయని చెప్పాను. వెనక

నించైనా వెళ్ళగలిగితే అక్కడ నౌఖర్లు వుంటారనీ, కానీ అటు వెళ్ళే అవకాశం లేకుండా దొంగల్నుంచి తోట పళ్ళని కూరగాయల్ని కాపాడేందుకు కట్టిన ఎత్తైన గోడ వుందని చెప్పాను.

వాళ్ళు ఇచ్చిన పడక మీద పడుకోని కళ్ళదాకా దుప్పటి కప్పుకున్నాను కానీ నిద్ర పోలేకపోయాను. తెల్లవారేదాకా నా గుండె చప్పుడు వింటూ వున్నాను. పొద్దున్నే నా నౌఖర్లందరినీ అక్కడికే పిలిపించమని అంతకు ముందే ఆర్డర్ వేశాను. ఉదయం ఏడు గంటలకి మా పెద్ద నౌఖరు వచ్చి తలుపుకొట్టాడు.

వాడి ముఖం దిగాలుగా వుంది.

"రాత్రి ఘోరం జరిగిపోయింది మాన్సియర్" అన్నాడు వాడు.

"ఏమైంది"

"మాన్సియర్ గారి ఫర్నీచర్ మొత్తం ఎవరో ఎత్తుకెళ్ళారు. చిన్న చిన్న వస్తువు కూడా వదిలిపెట్టలేదు"

ఆ మాట నాకు సంతోషాన్నిచ్చింది. ఎందుకు. ఏమో ఎవరికెరుక? నేను మళ్ళీ నా అదుపులోకి వచ్చేశాను. ఇక జరిగిన విషయం, నేను చూసిన విషయం ఎవరికీ చెప్పకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఆ దారుణమైన రహస్యాన్ని నా గుండెల్లోనే సమాధి చెయ్యాలని అనుకున్నాను.

"నా తాళాలగుత్తి దొంగతనం చేసినవాళ్ళే అయ్యుంటారు. వెంటనే పోలీసులకు చెప్పాలి. మీరు పదండి, నేను వచ్చి మిమ్మల్ని కలుస్తాను" అన్నాను.

ఆ తరువాత ఐదు నెలలపాటు పోలీసులు అసలా దొంగతనం ఎలా జరిగిందో అర్థం చేసుకోడానికి పరిశోధన చేశారు. ఏమీ దొరకలేదు. నాకు జరిగిన అనుభవం గురించీ తెలుసుకోలేకపోయారు, దొంగల ఆచూకీ తెలుసుకోలేకపోయారు. భగవంతుడా! నాకు తెలిసిన సంగతంతా వాళ్ళకి చెప్పి వుంటే? అహా అసలు చెప్పి వుంటే? నన్ను తీసుకెళ్ళి మూసేసేవాళ్ళు. దొంగల్ని కాదు, నన్ను లోపలేసేవాళ్ళు. జరిగిందంతా మొదట్నించి తెలిసినవాడిని, చూసినవాడిని నేనే కదా. అవును! అయినా నాకు మౌనంగా వుండటం ఎలాగో తెలుసు కదా!

ఇక నా ఇంట్లో ఒక్క సామాను కూడా వుంచను. అసలు పనికిరాని వస్తువులవి. మళ్ళీ వుంచితే అదే జరుగుతుంది. అసలు ఆ ఇంట్లో అడుగుపెట్టడానికి కూడా నాకు మనస్కరించడం లేదు. ఇంక చచ్చినా ఆ ఇంటికి వెళ్ళను. ఆ ఛాయలకే వెళ్ళను. అక్కడ్నుంచి ప్యారిస్ లో ఒక హోటల్ కి వచ్చేశాను. ఆ సంఘటన తరువాత నా నరాలు బాగా ఇబ్బంది పెడుతున్నాయని డాక్టర్లని కలిసాను.

వాళ్ళంతా ఎటైనా వేరే ప్రదేశానికి వెళితే మంచిదని సూచించారు. నేను వాళ్ళ మాటలు పాటించాను.

(ముగింపు వచ్చే నెల)

.****

COMMENTS